



విద్యుదాఘాతంతో యువ రైతు మృతి
పారిశుధ్య పనుల పరిశీలన
8లో

హోలీ... ఆనందాల కేళీ

- ఘనంగా కామదహనం
- నేడు జిల్లాలో హోలీ సంబరాలకు సర్వంసిద్ధం
- పలు పాఠశాలల్లో ముందస్తు సంబరాలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రంగుల పండుగ వచ్చింది. హోలీ వేడుకలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సంబురంగా జరుపుకోవడానికి చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రజలందరూ సిద్ధమయ్యారు. గురువారం రాత్రి జిల్లా వ్యాప్తంగా కామదహన వేడుకలు నిర్వహించారు. లోక కల్యాణం కోసం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిపించాలని దేవతలు నిర్ణయిస్తారు. పార్వ తీదేవిపై పరమశివుడి దృష్టి నిలిచేలా చేయమని మన్మధున్ని కోరుతారు. అలవాటు ప్రకారం శివుడుపైకి మన్మధుడు బాణాన్ని ప్రయోగించి తపోభంగం చేస్తారు. ఆగ్రహానికి లోనైన శివుడు మూడోకన్ను తెరిచి మన్మధున్ని భస్మం చేస్తాడు.



ఇలా కోరికలు దహింపజేసిన రోజు కావడం వల్ల కామదహనం పేరుతో మన్మధుడి బొమ్మను గడ్డితో తగల బెడతారనే పురాతన గాధలు చెబుతున్నాయి. హోలీకి ముందు రోజు కామదహన వేడుకలు సంబురంగా జరుపుకున్నారు.

రంగు పడాల్సిందే...

హోలీ రోజు అందరికి రంగు పడాల్సిందే. ఇందుకోసం యువకులు ఏర్పాటు చేశారు. ఈవెంట్ ఆర్గనైజర్లు రంగంలోకి దిగారు. జోష్‌ను పెంచే దిశగా డీజే సౌండ్ల మోతలు పెరగనున్నాయి. గతంలో ప్రకృతిలో దొరికే గోగుపూలతోపాటు పలు రకాల పూల నుండి సహజ సిద్ధంగా రంగులు తయారు చేసేవారు. ప్రస్తుతం ప్రమాదరకరమైన రసాయన రంగులతో ఆడుకోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కలర్‌ఫుల్ రంగులతో మార్కెట్ కళకళలాడుతుంది.

న్యూస్ బాక్స్

రేపటి నుంచి ఒంటి పూట బడులు

పెద్దపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, ఎయిడెడ్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఒంటి పూట బడులు నిర్వహించాలని గురువారం పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని పేర్కొన్నారు. పదో తరగతి విద్యా ర్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను కొనసాగించాలని, పరీక్షలు జరిగే పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులను నిర్వహిం చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

కళ్యాణ్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలోని ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు శుక్రవారం డయల్ యువర్ జీఎం కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్టు గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనే జర్ నాగభూషణం ఒక ప్రకటలో తెలిపారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు సూచనలు, సలహాలకు సెల్ నెం.9959225922కు ఫోన్ చేయాలన్నారు.

సాంప్రదాయ పద్ధతిలో హోలీ జరుపుకోవాలి

సీపీ అంబర్ కిశోర్ ఝా

కోల్‌సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎదుటివారికి ఇబ్బంది కలుగకుండా, మహిళల పట్ల మర్యాదగా ఉంటూ సాంప్రదాయ పద్ధతిలో హోలీ జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ప్రజలకు పిలుపు నిచ్చారు. సహజ సిద్ధమైన రంగులను వినియోగిస్తూ ప్రశాంత వాతావరణంలో హోలీ జరుపుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడుపవద్దన్నారు. హోలీ అనంతరం యువత స్నానాలకై చెరువు, లోతట్టు ప్రాంతాలకు వెళ్లవద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా పరిచయం లేనివారిపై, మహిళలు, యువతులు వాహనాలు రంగులు చల్లడం, బైక్‌లపై, కార్లలో గుంపులుగా తిరిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. పోలీసులు ముమ్మర పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసకుంటారన్నారు.

రామగుండంలో 'బూడిద' రాజకీయం

- నాడు బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ విమర్శలు
- నేడు కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్...
- ఒకరిపైనొకరు ఆరోపణలు, విమర్శలతో వేడేక్కిన రాజకీయం



మల్యాలపల్లి యాష్ పాండ్‌లో బూడిద లోడింగ్ చేస్తున్న ఎక్స్‌కావేటర్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రామగుండంలో బూడిద రాజకీయం మళ్లీ మొదలైంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు బూడిద తరలింపులో దోపిడీకి పాల్పడ్డారని, ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుల వద్ద డబ్బులు వసూలు చేశారని నాడు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపణలు, విమర్శలు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నాయకులు బూడిద లోడింగ్ పేరిట రోజుకు లక్షల రూపాయలు దండుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆరోపణలు చేస్తుండడంతో రాజకీయాలు వేడేక్కాయి. ఇరుపార్టీల నాయకుల మధ్య రోజురోజుకు దుమారం పెరుగుతుండగా, ఒకరిపై నొకరు ఆరోపణలు, విమర్శలు గుప్పించు కోవడం చర్చనీయాం శంగా మారింది.

ఇటుక బట్టీలకు రూపాయికే టన్ను బూడిద

తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు ద్వారా నిర్మించిన రెండు యూనిట్లు 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు నుంచి వెలువడుతున్న బూడిదను మల్యాలపల్లి చెరువు లోకి పంపిస్తున్నారు. చెరువులో బూడిద పేరుకు పోకుండా ఉండేందుకు ఎన్టీపీసీ ఇటుక బట్టీలకు ఒక రూపాయికే టన్ను బూడిద ఇచ్చేందుకు టెండర్లను ఆహ్వానించింది. టెండర్లలో పాల్గొన్న 114 మంది ఇటుక బట్టీల వ్యాపారులు, జీఎస్టీ చెల్లిస్తున్న ఇతర వ్యాపా రులు టెండర్లు ఇచ్చింది. లోడింగ్ చార్జీలు బూడిదను తరలించే వారే భరించాలి. లోడింగ్ చేసేందుకు గాను 5 ప్రొక్లెయిన్‌లకు అనుమతులు ఇచ్చారు. జిల్లాలో సొం తంగా ఇటుక బట్టీలు ఉన్న వారికే ఎన్టీపీసీ అనుమ తులు ఇచ్చింది.

ఒక్కో లారీలో బూడిద లోడింగ్ చేసినం దుకు రూ.4 వేల నుంచి 9 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఎన్టీ పీసీ ప్రొక్లెయిన్లు పెట్టి బూడిద లోడింగ్ చేస్తే రూ.800 నుంచి 1200లకు మించి కాదని, లోడింగ్ పేరిట అధి కార పార్టీకి చెందిన నాయకులు బినామీల పేరిట డబ్బులు దండుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి, తదితరులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి నుంచి నిత్యం 400 నుంచి 500 లారీల్లో బూడిద తరలి పోతు న్నదని, లోడింగ్ పేరిట అదనపు వసూళ్లు చేసి రోజుకు రూ.20 లక్షల వరకు దోచుకుం

(మిగతా 8వ పేజీలో)

మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు చేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, యాసంగి మార్కెటింగ్ సీజన్‌లో ఇబ్బందులు లేకుండా చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేసి 48 గంటల్లో చెల్లింపులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. పంట దిగుబడికి తగ్గట్టుగానే అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు గన్ని బ్యాగులపై నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. మార్కెటింగ్ అధికారితో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సామగ్రి కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు వడ్లకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు త్వరితగతిన తరలించాలన్నారు. హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా డీఎం మార్కెటింగ్ శ్రీకాంత్, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్, పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలి

పెద్దపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఓటర్ జాబితా సవరణ, ఇతర అంశాలపై ఈనెల 19వ తేదీలోగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో ప్రతీ 3 నెలలకు ఒకసారి అప్‌డేట్ కావాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతీ పౌరుడికి ఓటు హక్కు కల్పించాలన్నారు. సమావేశం వివరాలను ఈనెల 27లోపు ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఆర్‌డీఓ బి.గంగయ్య, సూపరిండెంట్ విజయ్, పాల్గొన్నారు.

స్త్రీ నిధి బకాయిలను చెల్లించాలి

పెద్దపల్లిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్త్రీ నిధి బకాయిలను చెల్లించాలని అదనపు కలెక్టర్ అరుణశ్రీ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం వంద శాతం రికవరీ సాధించాలన్నారు. స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని తెలిపారు. మహిళా సమాఖ్యలలో దీర్ఘకాలంగా బకాయి ఉన్న కమ్యూనిటీ ఆర్గనైజర్స్ రిసోర్స్‌పర్సన్‌లను సమీక్ష చేసి బకాయిలు పూర్తిగా కట్టించాలన్నారు. సమీక్షకు హాజరు కాని రిసోర్స్‌పర్సన్లపై చర్య తీసుకోవాలని ఆదేశించారు. రికవరీలలో అవకతవకలు జరిగితే క్రిమినల్ కేసులు పెట్టాలని స్పష్టం చేశారు. రిసోర్స్‌పర్సన్ బాకీ పడిన సభ్యులకు నోటీసులు ఇచ్చి రోజువారిగా రికవరీ వివరాలను రిపోర్ట్ చేయాలన్నారు. మహిళాశక్తిలో భాగంగా కొత్త యూనిట్‌లను నెలకొల్పాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, స్త్రీ నిధి రీజనల్ మేనేజర్లు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

రామగుండం అభివృద్ధికి నిధులు కేటాయించండి



గోదావరిఖని, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠా కూర్ కోరారు. గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. రామ గుండం బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధికి నోచు కోలేదని, అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులపై ముఖ్యమంత్రికి వివరించారు.

అసాంఘిక శక్తులపై కఠినచర్యలు

- గంజాయి నియంత్రణకు డ్రగ్ కంట్రోల్ సెల్
- పోలీసులను ఆశ్రయించేందుకు మధ్యవర్తులు వద్దు...
- టాస్క్‌ఫోర్స్‌ను మరింత బలోపేతం చేస్తా...
- పద్ధతులు మార్చుకోకపోతే పీడీ యాక్టులు తప్పవు...
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



కోల్‌సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషరేట్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేదని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారు వెంటనే వెళ్లిపోవాలని, లేకపోతే తానే వెళ్లగొడతానని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా హెచ్చరించారు. రామగుండం కమిషనర్‌గా బాధ్యతలు తీసు కున్న ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు. పోలీస్ అంటేనే ప్రజల్లో భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా తమ పని తీరు ఉంటుందన్నారు. రామగుండం కమిషనరేట్ పరిధి పారిశ్రామిక జిల్లాలతో కూడుకున్నదని, ఇక్కడ యువత ఎక్కువగా ఉందని, యువత సన్మార్గంలో పయనించేలా శిక్షణ ఇస్తామన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మీ స్వస్థలం?

కమిషనర్: బీహార్‌లోని మధుబని స్వస్థలం.

ఆంధ్రజ్యోతి: మీ విద్యాభ్యాసం?

కమిషనర్: 12వ తరగతి వరకు మధుబనిలో చదివాను. ట్రిచీ ఎన్ఐటీలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ పూర్తి చేశా. హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీలో వైజాగ్, గుజరాత్‌ల్లో ఏడాది పాటు పని చేశాను. 2009లో సివిల్స్‌కు ఎంపికయ్యాను.

ఆంధ్రజ్యోతి: మీ కుటుంబ నేపథ్యం?

కమిషనర్: నా భార్య త్రిప్తి మిశ్రా ఎండీ(పాథాలజీ) ఢిల్లీలోని అంబాలలో పని చేస్తుంది. ఇద్దరు పిల్లలు. ఒకరు 4వ తరగతి, మరొకరు 6వ తరగతి.

ఆంధ్రజ్యోతి: కమిషనరేట్‌లో నేరాల నియంత్రణకు తీసుకునే చర్యలు?

కమిషనర్: రామగుండం కమిషనరేట్ పారిశ్రామిక జిల్లాలతో కూడుకున్నది. ఉట్నూరు ఏఎస్పీగా ఉన్నప్పుడు మంచిర్యాల ఇన్‌చార్జి ఏఎస్పీగా పని చేశా. ఈ ప్రాంత ప్రజలు మంచివారు. పోలీసులంటే భరోసా కల్పించేలా చర్యలు చేపడుతాను.

ఆంధ్రజ్యోతి: కమిషనరేట్ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కు వగా ఉన్నాయనే ఆరోపణలున్నాయి.?

కమిషనర్: అసాంఘిక కార్యకలాపాలు, శక్తుల విషయంలో రాజీ పడేదిలేదు. అలాంటి వారు కమిషనరేట్ వదిలి వెళ్లిపోవాలి. లేకపోతే నేనే పంపించేస్తా. మంచిగా ఉండే వారికి గౌరవమిస్తా.

ఆంధ్రజ్యోతి: కమిషనరేట్ పరిధిలో యువతలో మార్పునకు ఏమైనా చర్యలు చేపడుతారా?

కమిషనర్: కమిషనరేట్ ఎదుట యువత ఖాళీగా ఉండడాన్ని గుర్తించాను. రామగుండంలో యువత ఒక సంపద. వారికి శిక్షణనిచ్చి ఉపాధి వైపు తీసుకెళ్లాలి. తద్వారా సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం చేయాలి. సింగరేణి, ఎన్‌టీపీసీ వంటి పరిశ్రమలతోపాటు ప్రభుత్వశాఖలతో సంప్రదిస్తాను. త్వరలోనే శిక్షణ కార్యక్రమాలు మొదలు పెడతాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి సామాజిక మహమ్మారిగా మారింది. దీని నియంత్రణకు చర్యలేమిటి?

కమిషనర్: గంజాయి నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ తీసుకుంటున్నా. డ్రగ్ కంట్రోల్ టీమ్ ఏర్పాటు చేశాం. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఎస్ఐ, ఇతర సిబ్బంది ఈ టీములో ఉంటారు. గంజాయి విక్రయాలు, వినియోగంపై సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక నంబర్ కూడా ఏర్పాటు చేస్తా. గంజాయి రవాణా, విక్రయాలను ఉపేక్షించేది లేదు. గంజాయి సమాచారం చెప్పే వారి విషయంలో గోప్యత పాటిస్తాం.

ఆంధ్రజ్యోతి: రౌడీషీటర్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారనే ఆరోపణలపై మీ స్పందన?

కమిషనర్: ప్రజల రక్షణ మాకు ముఖ్యం. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదు. అందరిని పిలిచి కౌన్సెలింగ్ చేస్తా. పీడీ యాక్టులు తప్పవు.

ఆంధ్రజ్యోతి: టాస్క్‌ఫోర్స్ నామమాత్రమైందంటున్నారు..?

కమిషనర్: టాస్క్‌ఫోర్స్‌లో సిబ్బంది సంఖ్యను పెంచి పటిష్ట పరుస్తాం. ఇప్పటికే వారితో సమావేశం నిర్వహించాను. వారికి శిక్షణ కూడా ఇవ్వనున్నాం. వారు సమాచారం సేకరించేందుకు ఇంటెలిజెన్స్ వ్యవస్థ, శారీర దారుఢ్యత కూడా ముఖ్యమే. తాను హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా పని చేసినప్పుడు పటిష్టమైన టాస్క్‌ఫోర్స్ టీమును పెట్టాను. ఇక్కడ కూడా అలాంటి టీమ్ పని చేయబోతుంది.

ఆంధ్రజ్యోతి: భూ కబ్జాల విషయంలో మీ వైఖరి ఏమిటి?

కమిషనర్: నిబంధనల ప్రకారం వ్యవహరిస్తాం. బాధితులకు న్యాయం చేసేలా మా పని తీరు ఉంటుంది. ఫిర్యాదులపై సీనియర్ అధికారులతో విచారణ జరిపిస్తాం.

ఆంధ్రజ్యోతి: పోలీస్‌స్టేషన్‌లలో మధ్యవర్తుల ప్రమేయం పెరిగిందనే ఆరోపణలున్నాయి?

కమిషనర్: ఫిర్యాదుదారులు, బాధితులు ఎవరూ మధ్యవర్తులను ఆశ్రయించవద్దు. ఎవరి సిఫార్సు ఉన్నా లేకున్నా బాధితుల సమస్య వింటాం. వారికి న్యాయం జరిపించేందుకు పని చేస్తాం.

జేఎన్టీయూను సందర్శించిన

యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్



బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభిస్తున్న వీసీ దంపతులు

రామగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల(మంథని)ను యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ కిషన్‌కుమార్‌రెడ్డి గురువారం పర్యటించారు. వీసీగా బాధ్యతలు స్వీకరించిన కిషన్‌కుమార్‌రెడ్డి సతీమణి సుజనతో కలసి కళాశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్ బి. విష్ణువర్ధన్ వారికి స్వాగతం పలికారు. కళాశాల ప్రాంగణంలోని సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రీడామైదానంలో బాస్కెట్‌బాల్ కోర్టును ప్రారంభించారు. అకడమిక్ బ్లాక్‌లో మహిళాలకు ఏర్పాటు చేసిన విశ్రాంతి గదిని ప్రారంభించారు. కళాశాల సంబందించిన అనుమతులు, ఫ్యాకల్టీ, ఔట్ సోర్సింగ్, విద్యార్థుల సంఖ్య, ల్యాబ్‌లు, ప్లేస్ మెంట్ వివరాలు ప్రిన్సిపాల్ వీసీకి తెలిపారు. అనంతరం సింగరేణికి చెందిన రెస్క్యూ జీఎం కె శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా వర్క్‌షాప్ ఎంజీఎం ఎర్రన్న, ఎక్స్‌ప్లోరేషన్ డీజీఎం సుభాస్‌తో సమావేశం నిర్వహించి పలు విషయాల పై చర్చించారు. సెమినార్ హాల్‌లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులతో సమావేశం నిర్వహించి పలు విషయాలను తెలుసుకున్నారు. వీసీ దంపతులను కళాశాల యాజమాన్యం సన్మానించారు. ఇన్‌చార్జి లైబ్రేరియన్ రమణ, జూనియర్ అసిస్టెంట్లు, కాంట్రాక్టు అధ్యాపకులు, ఔట్‌సోర్సింగ్ పాల్గొన్నారు.

సంఘటన జరిగిన వెంటనే స్పందించాలి

రామగుండం కమిషనరేట్ పరిధి ఎస్ఐలతో సీపీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా, హాజరైన పోలీస్ అధికారులు

కోల్‌సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పోలీస్ అధికారులు ఏదైన సంఘటన జరిగినప్పుడు త్వరితగతిన స్పందించాలని, వెంటనే ఘటన స్థలానికి వెళ్లాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. గురువారం పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌ల పరిధిలోని ఎస్ఐలతో కమిషనరేట్‌లో సీపీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘటన జరిగిన వెంటనే ఘటన స్థలానికి వెళితే సమాచారం, ఆధారాలు దొరుకుతాయన్నారు. స్వీయరక్షణ పాటించాలని, ఘటన స్థలాలకు ఒంటరిగా వెళ్లవద్దన్నారు. ఏమైనా సమస్యలు వచ్చినప్పుడు పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. సంకల్పం, నిబద్ధతే అధికారులకు గౌరవం తెచ్చిపెడుతుందని సీపీ పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిబద్ధతతో కష్టపడి విధులు నిర్వహించినప్పుడు గుర్తింపు వస్తుందన్నారు.

గోదావరిఖనిలో అర్థరాత్రి సీపీ తనిఖీలు

గోదావరిఖని పట్టణంలో బుధవారం అర్ధరాత్రి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డీసీపీ కరుణాకర్, గోదావరిఖని ఏసీపీ రమేష్‌లతో కలిసి రైల్వే ట్రాక్‌లు, నిర్మానుశ్య ప్రాంతాల్లో పరిశీలన జరిపారు. సుమారు 30మంది డిస్ట్రిక్ట్ గార్డ్‌లను పిలిపించి బొగ్గు, స్క్రాప్ చోరీకి అవకాశం ఉన్న ప్రాంతాలు, గంజాయి సేవించే ప్రాంతాలను జల్లెడ పట్టించారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు, సిబ్బందితో ఇందిరానగర్, సంజయ్‌గాంధీనగర్, చంద్రశేఖర్‌నగర్, 7ఎల్‌ఈపీ కాలనీ ఏరియా, ఫైవింక్లయిన్ ఏరియా, సీఎస్‌పీ ఏరియా తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేయించారు. ఎక్కడెక్కడ బొగ్గు, స్క్రాప్ చోరీలు జరిగే ప్రాంతాల గురించి ఆరా తీశారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలో ఫిబ్రవరి 5నజరిగిన గొడవకు సంబంధించి ఎస్సీఎస్టీ కేసునమోదుకాగా, నిందితులను గురువారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణీపేటలో అక్రమంగా ఓ ఇంటిలో నిల్వ ఉంచిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని జగిత్యాల టౌన్ పోలీసులు, సివిల్ సప్లయిస్ అధికారులు కలిసి పట్టుకున్నారు. పట్టణానికి చెందిన షేక్‌చాంద్ అనేవ్యక్తి రేషన్‌బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ సొమ్ముచేసుకుంటున్నట్లు గురువారం పోలీసులకు సమాచారం అందింది. తనిఖీల్లో ఓ ఇంటిలో దాచిన ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని సీజ్‌చేసి చాంద్‌పై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో టౌన్ ఎస్సై కిరణ్ కుమార్, డీటీ వర ప్రసాద్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి రిమాండ్

శంకరపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన గుర్రంమల్లయ్య తనను తన తమ్ముడు గుర్రంనారాయణ టీఎస్36 3186గల కారుతో ఆక్సిడెంట్‌చేసి చంపాలని ప్రయత్నించాడని డిసెంబరు 2, 2024లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేశవపట్నం పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేసి గురువారం నారాయణను అరెస్టు చేసి హుజూరాబాద్ కోర్టులో హాజరుపరిచారు. నారాయణకు కోర్టు 15రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై కొత్తపల్లి రవి తెలిపారు.

పంటలను కాపాడుకునేందుకు

అన్నదాతల అష్టకష్టాలు

- బావుల్లో పూడికతీత
- రైతుపై అదనపు భారం
- క్రేన్లకు పెరిగిన గిరాకీ

గంగాధర/సైదాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతతో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండి పోతున్నారు. వాటిని కాపా డుకునేందుకు రైతులు తిప్పలు పడుతు న్నారు. మెట్టప్రాంతాలైన గంగాధర, సైదా పూర్ మండలాల్లో 15 మీటర్లపైన తవ్వితే గాని నీరు పడదు. పలు గ్రామాల్లో 17 మీటర్లపైన తవ్వితే బండరాయి వస్తుం టుంది. వానకాలం పంటలకు సాగునీటికి ఇబ్బంది లేకున్నా యాసంగిలోనే తీవ్ర ఇబ్బందిపడుతుంటారు. యాసంగిలో ముంద స్తుగానే నాట్లు వేస్తున్నప్పటికి గొలక దశలో పంటలకు నీరందక రైతులు అరిగోస పడుతుంటారు. పంటలను కాపాడుకునేం దుకు పలువురు రైతులు బావుల్లో పూడిక తీతను చేపట్టారు. బావుల్లో మూడు గజాల లోతు తవ్వితే సుమారుగా మూడు లక్షల రూపాయలు ఖర్చవుతుంది. అయినా రైతులు అప్పులు చేసి పంటలను కాపాడుకునేందుకు బావు లను మరింత లోతు తవ్విస్తున్నారు. మరో ఇరవై రోజులు పొలానికి నీరందిస్తే చేతి కొస్తుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం గొలక వేస్తుండగా అక్కడక్కడ పొలం పొట్టకు వచ్చింది. ఈ యాసంగిలో తెలుళ్ళు, చీడలు లేకపోవడంతో దిగుబడివస్తుందన్న నమ్మకంతో రైతులు అప్పులు చేసి బావుల్లో పూడిక తీయిస్తున్నట్లు తెలిపారు. బావుల్లో పూడిక తీసే క్రేన్లకు గంగాధరలో గిరాకీ ఎక్కువగానే ఉంది. భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతుండగా పంటను కాపాడుకునేందుకు పూడిక తీత క్రేన్ల కూలీల వద్ద క్యూ కడుతున్నారు.

● పైపుల ద్వారా పొలాలకు నీరు.

వ్యవసాయ బావుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని పైపులు వేసి పారిస్తున్న ఫలితం శూన్యం. రైతన్న పంట పొలాలు దక్కించుకోవడం దిన దినంగా గండంగా మారింది. వందల ఎకరాల్లో పంట పొలాలు మరో 20రోజుల్లో చేతికందే సమయంలో ఎండిపోతున్నాయి. దీంతో ప్రతి గుంటకు పైపుల ద్వారా నీటిని పారిస్తున్నారు.



గంగాధర మండలం గర్షకుర్తిలో పూడిక తీస్తున్న కూలీలు

చేతికందే సమయంలో ఎండిపోతున్న వరి పొలం.

- భీంరెడ్డి అరుణ్‌రెడ్డి, రైతు, అమ్మనగుర్తి, సైదాపూర్ మండలం



నాకున్న మూడెకరాల్లో రెండెకరాలు సీడ్ వరి వేశాను. పంట చేతికచ్చే సమయంలో నీరు లేక పొలం ఎండిపోతుంది. వరి పొట్ట దశలో ఉంది. లక్షల రూపాయలు అప్పులు తెచ్చి బావిలో పూడిక తీసినా గంట సేపు కూడా మోటర్ పోయడం లేదు. ఎండుతున్న వరిని ఏం చేయాలో తెలియక ఆవులు, గేదెలకు మేతగా కోసి వేస్తున్నాను.

రూ. మూడు లక్షలు పెట్టి బాయి తవ్విస్తున్నా.

- పల్ల కుంటయ్య, రైతు, గర్షకుర్తి, గంగాధర మండలం



రెండున్నర ఎకరాల భూమిలో వరి సాగు చేసిన. రోజురోజు ఎండలకు బాయిల నీళ్ల అడుగంటినయి. బాయిల ఊరినవి ఊరినట్లు పెట్టుతున్న పొలానికి సరిపోవడం లేదు లేదు. పొలం చేసినందుకు మరింత ఖర్చు పెట్టి బండరాయిని తవ్విస్తున్న. పంట పండితే ఎప్పటికైనా బాకీ తీర్చుకోవచ్చు. మూడు గజాలు తవ్విస్తే మూడు లక్షల రూపాయల ఖర్చయింది.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

గన్నేరువరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి రాజీవ్ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. కరీంనగర్‌కు చెందిన ఆదూరి అభినవ్ జగిత్యాలకు చెందిన కోనూరు శ్రీవర్ధన్ బైక్‌పై హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళుతున్నారు. మండలంలోని హన్మాజిపల్లికి చెందిన కల్లెపెల్లి సాయికృష్ణ గుండ్లపల్లి నుంచి కరీంనగర్‌కు వెళుతున్నాడు. ఈ రెండు బైక్‌లు గుండ్లపల్లి స్టేజి వద్ద మూలమలుపుపై వేగంగా ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికీ తీవ్రగాయాలు కాగా జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు.

కుక్కల దాడిలో వృద్ధురాలికి గాయాలు



వృద్ధురాలి చేతిపైన గాయాలు

వీర్నపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కుక్కలదాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలైన ఘటన వీర్నపల్లి మండలం లాల్‌సింగ్ తండా గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులవివరాల ప్రకారం.. తండాకు చెందిన చింగ్లి బాయ్(85) వృద్ధురాలు ఇంటి బయటమంచంలో నిద్రిస్తుండగా కుక్కలుఒకసారిగా దాడి చేశాయి. దాడిలో రెండు చేతులకు, కడుపుపైన తీవ్ర గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది.

బస్సు ఢీకొని ఎక్సైజ్ సూపరింటెండెంట్ భార్య మృతి

శంకర్‌పల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతిచెందగా, మరోవ్యక్తికి తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని ఎక్సైజ్ డిపార్టుమెంట్‌లో సూపరిండెంట్‌గా విధులు నిర్వహించే రవిందర్ తనకుటుంబంతో కలిసి మోకిలలోని ఎన్‌సీడీ ఎవెన్యూలో కొన్నాళ్లుగా నివాసముంటున్నాడు. హోండాయాక్టివాపై భార్యాభర్తలు రవిందర్, ఉమాదేవి బుధవారం సాయంత్రం పని నిమిత్తం నార్సింగికి వెళ్లారు. పని ముగించుకుని రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా, మోకిలలోని సుబిషి విండ్‌సర్ హోమ్స్ వద్ద అతివేగంగా వెను కనుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొది. దీంతో హోండా యాక్టివాపై ఉన్న రవిందర్, ఉమాదేవి కిందపడిగా వారికి తీవ్రగాయాల య్యాయి. వారినివెంటనే చికిత్సనిమిత్తం కుటుంబీకులు, స్థానికులు శంకర్‌పల్లిలోని ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఉమాదేవిని సంగారెడ్డిలోని ఆసుపత్రికి తరలించారు. కాగా ఆమె అప్పటికే చనిపోయిందని డాక్టర్లు తెలిపారు. గాయపడిన రవిందర్ గచ్చిబౌలిలోని సన్‌షన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగాఎక్సైజ్ సూపరింటెండెంట్ రవిందర్ ఈనెల31న రిటైర్డు అవ్వనున్నారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

చొప్పదండి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): చొప్పదండికి చెందిన తాళ్లపల్లి అమృతవ్వ(70) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ అనూష కథనం ప్రకారం.. తనకుమారుల భూమి గొడవల కారణంగా మనస్థాపంతో జీవితంపై విరక్తిచెందిన అమృతవ్వ ఇంట్లోఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

మైనర్లు నడుపుతున్న వాహనాలు సీజ్

కరీంనగర్ క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు గురు వారం ఇందిరాచౌక్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాహనాలు నడుపుతున్న 15మంది మైనర్‌లనుపట్టుకుని, వాహనాలను సీజ్‌చేశారు. అలాగే శబ్ధ కాలుష్యానికి కారణమవుతున్న రెండు ద్విచక్రవాహనాలను పట్టుకుని ఠాణాకు తరలించారు. పట్టుబడిన మైనర్‌ల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మరోసారి మైనర్‌లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తామని విద్యార్థులకు పరీక్షల జరుగుతున్నందున పెద్దపెద్ద శబ్దాలు చేసే వాహనాల యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ అన్నారు. ఈతనిఖీలలో ట్రాఫిక్‌సీఐ పర్శరమేష్, ఎస్‌ఐ ఉపేంద్రచారి, ఆర్‌ఎస్‌ఐ గణేష్ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు

వీర్నపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా తయారుచేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. వీర్నపల్లి మండలం భూక్యతండా గ్రామంలో ఇండ్లలో నిల్వ చేసిన గుడుంబా స్థావరాలపై ఎస్‌ఐ ఎల్లాగౌడ్‌తో కలిసి పోలీసులు గురువారం దాడులు చేశారు. దాడుల్లో 950 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు ధ్వంసంచేశారు. సారా తయారీకి ఉపయోగించే 25 కిలోల బెల్లం, 20 లీటర్ల గుడుంబా, పట్టుకొని సీజ్ చేశారు. సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములు, బిందెలను పగలగొట్టారు. సారా తయారుచేస్తున్న వ్యక్తిపై వివిధ సెక్షన్లలో ఆరుకేసులు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. తండాలలో గుడుంబా తయారు చేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దాడుల్లో ఎస్‌ఐ ఎల్లాగౌడ్, హెడ్ కానిస్టేబుళ్ల బాబు, లక్ష్మణ్, సిబ్బంది మల్లాగౌడ్, కార్తీక్, యాకుబ్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేసిన వ్యక్తికి జరిమానా

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల ద్వారా దూషిస్తూ, అసత్య ప్రచారం చేసిన కేసులో ఒకరికి రూ.5వేల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు సెకండ్ అడిషనల్ న్యాయమూర్తి వినీల్‌కుమార్ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గొల్లపెల్లి పోలీస్‌స్టేషన్‌పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి ఎరవేణి రమేష్‌పై అదేగ్రామానికి చెందిన మహ్మద్‌నజీర్ అనేవ్యక్తి సామాజిక మాధ్యమాలద్వారా తప్పుడు ప్రచారంచేశాడు. తీవ్ర మానసికక్షోభకు గురైన రమేష్ 2020లో జరిగిన విషయాన్ని గొల్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై జీవన్ కేసు నమోదుచేశారు. కోర్టు డ్యూటీఅధికారులు సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరంరుజువు కావడంతో ముద్దాయి నజీర్‌కు జరిమానావిధిస్తూ న్యాయమూర్తితీర్పు వెలువరించారు.

రిటైర్డ్ తహసీల్దార్‌పై కేసు నమోదు

చందుర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామంలో వ్యవసాయభూమిని అక్రమంగా పట్టాచేసిన రిటైర్డ్ తహసీల్దార్ బాలయ్యపై కేసు నమోదుచేసి, నోటీసు జారీ చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. సీఐకథనం ప్రకారం మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన నేరెళ్ల ఎల్లయ్యకు చెందిన 898 సర్వేనంబర్‌లోని 18గుంటల వ్యవసాయ భూమినిఇదే గ్రామానికి చెందిన పత్తిపాక దేవరాజంకు 2005లోఅక్రమంగా పట్టాచేశారని ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి నోటీసులు ఇచ్చినటుసీఐ పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి హల్‌చల్

- మద్యం మత్తులో బీరు సీసాతో తలపై గాయపరుచుకున్న వైనం
- తన భార్యను కాపురానికి వచ్చేలా చూడాలని వేడుకోలు



పోలీస్‌స్టేషన్ ఎదుట గాయపడిన యువకుడు శివరాం

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట శివరాం అనే యువకుడు మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. తన భార్యను కాపురానికి పంపాలని పోలీసులను వేడుకుంటూనే బీరు సీసాతో తలపై గాయపరుచుకుని అరగంటకు పైగా ఆందోళనకు దిగాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బేడబుడుగ జంగాల కాలనీకి చెందిన మంజుల అనే మహిళతో కరీంనగర్ జిల్లా రామడుగుకు చెందిన శివరాంకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాలు, ఓ కేసులో జైలు శిక్ష అనుభవించిన శివరాంతో కాపురం చేయడం ఇష్టం లేక మంజుల జగిత్యాలలోని తన పుట్టిన ఇంట్లోనే కొద్ది కాలంగా ఉంటోంది. గురువారం తన భార్యను కాపురానికి పంపాలని పెద్ద మనుషులను శివరాం వేడుకున్నప్పటికీ వెళ్లేందుకు మంజుల ఒప్పుకోలేదు. తీవ్ర మనస్థాపానికి గురైన శివరాం జగిత్యాల పట్టణపోలీస్ స్టేషన్‌కు మద్యం మత్తులో వచ్చి బీరు సీసాతో తలపై కొట్టుకున్నాడు. ఎస్సైలు కిరణ్ కుమార్, మన్మదరావు, గీతలతో పాటు పోలీసు సిబ్బంది శివరాంకు నచ్చజెప్పడంతో తన ఆందోళనను విరమించాడు. పోలీస్ స్టేషన్ ఎదుట బీరుసీసా ముక్కను చేతిలో పట్టుకొని భయభ్రాంతులకు గురి చేసిన శివరాంపై పోలీసులు న్యూసెన్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు.

ఇంట్లో షార్ట్ సర్క్యూట్

- నగదు, నగలు, ఇతర సామాను దగ్ధం
- సుమారు రూ.25లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన నగదు

శంకరపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ గ్రామంలోని ఓ ఇంట్లో గురువారం షార్ట్ సర్క్యూట్ ఏర్పడి సుమారు రూ.25లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. బాధితుడు ముద్రకోలా గోపి తెలిపిన వివరాలు ప్రకారం.. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ముద్రకోలా గోపి కొన్నేళ్లుగా గ్రామంలో గాజులు, ఫ్రిడ్జ్, కుర్చీలు, కూలర్లు, మిక్సీలు, తదితర వస్తువులు అమ్ముతున్నాడు. రోజువారిలాగానే గురువారం ఉదయం భార్య స్వప్నతో పాటు గోపి ఇతరగ్రామాలకు వ్యాపారం చేసుకోవడానికి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు అంటుకోవడంతో గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి ఇంట్లో ఉన్న రూ.1.20లక్షల చిట్టీ డబ్బులు, కంగన్‌హాల్ వస్తువులు, 5తులాల బంగారం, 20తులాల వెండీ అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈప్రమాదంలో సుమారు రూ.25 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. కాగా కేశవపట్నం పోలీసుల తోపాటు ఆర్‌ఐ బాలకిషన్ లింగాపూర్ చేరుకొని వివరాలు సేకరించారు.

'వైఫై' విషయంలో ఇద్దరి మధ్య గొడవ

- కుటుంబ సభ్యులపై దాడి
- చికిత్స పొందుతూ ఒకరి మృతి
- హత్య కేసు నమోదు



బహదూర్ భగత్(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌నెట్ వైఫై విషయంలో జరిగిన చిన్న గొడవ ఒకరి హత్యకు దారితీసింది. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఫేమస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఇద్దరు వర్కర్ల మధ్య బుధవారం మధ్యాహ్నం 'వైఫై విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవలో కరీంనగర్ కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న భగత్(40) తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కరీంనగర్ మూడోఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల చౌరస్తా ఫేమస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న బహదూర్ రాజుకు, అదే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న జగదీష్‌మధ్య బుధవారం మధ్యాహ్నం చిన్నగొడవ జరిగింది. ఒక కస్టమర్‌కు వైఫై పాస్‌వర్డ్ చెప్పే విషయంలో ఇద్దరు గొడవపడి కొట్టుకున్నారు. అనంతరం జగదీష్ ఇంటికి వెళ్లిపోయి అర్ధరాత్రి మళ్లీ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు రాగా అతనికి బహదూర్‌రాజు సారీ చెప్పాడు. అయితే తనను అకారంగా బహదూర్‌రాజు కొట్టాడనే విషయాన్ని గురువారం ఉదయం జగదీష్‌తన బంధువులకు చెప్పుకున్నాడు. దీంతో జగదీష్‌తోపాటు మరికొందరు కలిసి ఉదయం 10గంటలసమయంలో కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న బహదూర్‌రాజు ఇంటికి వెళ్లి బహదూర్‌రాజు, అతనిసోదరుడు ఆకాశ్, తండ్రిభగత్‌ను చంపాలనే ఉద్దేశ్యంతో జగదీష్, అతనిసోదరులు బహదూర్ శంకర్, భారత్, దీపక్, కృష్ణ కలిసి ముగ్గురి కళ్లల్లో కారం పొడి చల్లి, కర్రలతో దాడిచేశారు. దీంతో బహదూర్ రాజు, ఆకాశ్ అక్కడినుంచి తప్పించుకుని పారిపోగా తండ్రి భగత్‌కుతీవ్రంగా రక్తగాయాలయ్యాయి. భగత్‌ను మొదట ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తరువాత మెరుగైన చికిత్స కోసం ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా సాయంత్రంభగత్ మృతిచెందాడు. మృతుడికొడుకు బహదూర్‌రాజు ఇచ్చిన ఫిర్యాదుతో జగదీష్, అతనిసోదరులపై హత్యకేసు నమోదుచేశామని, విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

కిరాణా షాపులో చోరీ

శంకరపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకాయగూడెం గ్రామంలోని కిరాణాషాపులో గురువారం చోరీ జరిగింది. బాధితురాలు బూర్ల లక్ష్మి తెలిపిన వివరాలప్రకారం.. కిరాణాషాపులో మహిళా సంఘాలకు సంబంధించిన12వేల నగదు ఉంచి బుధవారం సాయంత్రం షాపు తాళం వేశారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు తలుపులకున్న గొల్లాన్ని ఊడదీసి లోపలివస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. క్యాష్‌కౌంటర్‌లో ఉంచిన నగదు మాయమైంది. ఈఘటనపై కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ల చోరీ

వీణవంక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్ముక్ల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో 3కంప్యూటర్లు చోరీకి గురైనట్టు గుర్తించారు. ఎస్‌ఐ తోట తిరుపతి కథనం ప్రకారం.. పాఠశాలలో 11కంపూటర్లు ఉండగా ఈనెల 8,9వ తేదీలు సెలవులు రాగా 11న పాఠశాల కంప్యూటర్ ఇన్‌చార్జీ వెళ్లి చూడగా మూడు కంప్యూటర్లు కనిపించలేదు. మూడింటి విలువ దాదాపు రూ.20,000 ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

65 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దపల్లి/సుల్తానాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి, సుల్తానాబాద్ మండలాల్లో అక్రమంగా తరలించేందుకు నిల్వ చేసిన 65 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి రాజేందర్ తెలిపారు. గురువారంజిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు అందిన పక్కాసమాచారంతో పెద్దపల్లిలోని బండారికుంట, సుల్తానాబాద్ మండలంలోని దేవుని పల్లి గ్రామాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీచేశారు. డీఎస్‌ఓ రాజేందర్ మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలం దేవునిపల్లిలో నిల్వ ఉన్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, పెద్దపల్లిలోని బండారి కుంట వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని తెలిపారు. మొత్తం 65 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేశామన్నారు. సీజ్‌చేసిన రేషన్‌బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించామని, ఆటోను పోలీస్‌స్టేషన్లో అప్పగించామని డీఎస్‌ఓ తెలిపారు.వాహనంయజమాని, డ్రైవర్, అక్కడపని చేస్తున్న ఇతరలేబర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తనిఖీలలో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రవీందర్, మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తమ సోదరుడి వ్యవసాయ పొలంలోకి కలుషితనీరువస్తున్నాయని పేర్కొంటూ రైస్‌మిల్లులోకి అక్రమంగా ప్రవేశించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించిన సంఘటనలో మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన ల్యాగలశ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. గొల్లపల్లి గ్రామంలోని పొన్నాలదేవరెడ్డి గ్రామశివారులో శ్రీరాజరాజేశ్వర రైస్ మిల్లును నడిపిస్తున్నాడు. ఈనెల 12న సాయంత్రం తన వ్యాపార భాగస్వామి అయిన రాజిరెడ్డితో కలిసి రైస్‌మిల్లులోని కార్యాలయంలో ఉండగా శ్రీనివాస్‌రెడ్డి లోనికి వచ్చి కలుషిత నీరు పొలాల్లోకి వస్తున్నాయని గొడవకుదిగాడని చెప్పారు. అసభ్యపదజాలంతో దూషిస్తూ ఇనుప రాడుతో కార్యాలయ తలుపును ధ్వంసం చేశాడని పేర్కొన్నారు. బాధితుడు దేవరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదకరంగా గన్నేరువరం చెరువు కల్వర్టు

- రెండు వైపులా కుంగిన సీసీ రోడ్డు
- పొంచి ఉన్న ప్రమాదం



చెరువు వద్ద కల్వర్టు పైన రెండు వైపులా కుంగిన సీసీ రోడ్డు

గన్నేరువరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువు వద్ద ఉన్న లోలెవల్ కల్వర్టుపై సీసీరోడ్డు రెండు వైపులా కుంగి ప్రమాదకరంగా మారింది. బస్సులు, భారీ వాహనాలు కల్వర్టుపై వెళితే వాహనాలు అదుపు తప్పి ప్రమాదం జరిగే అవకాశంఉంది. కుంగిన కల్వర్టుకు ఒకపక్కచెరువు మత్తడితో కూడినలోతైన ప్రదేశం, మరోపక్క చెరువు ఉండడంతో రెండువైపులా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. నిత్యం ఈ దారిగుండా గన్నేరువరం నుంచి పొత్తూరు మీదుగా కరీంనగర్‌కు బస్సులు వెళుతుంటాయి. అంతేకాకుండా ప్రైవేట్‌వాహనాలు, ద్విచక్రవాహన దారులు భారీసంఖ్యలో వెళ్తుంటాయి. రాత్రిసమయంలోనూ ఈదారిగుండా ప్రయాణిస్తుంటారు. చెరువుకట్ట నుంచి కిందకు దిగే ప్రదేశంలోనే కల్వర్టుపై సీసీరోడ్డు కుంగిపోయి ఉండడంతో ఆదమరిచి రోడ్డుకు పక్కకు వెళితే ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితి ఉంది. ఎదురుగా వాహనంవస్తే ఆగాల్సిందే. వాహనదారులు ఈదారిగుండా వెళ్లడానికి జంకుతున్నారు. కల్వర్టుపై హైలెవల్ బ్రిడ్జినిర్మిస్తే ప్రయాణం సులువవుతుందని వాహనదారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. మండలానికి డబుల్‌రోడ్డుతోపాటు హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించేందుకు నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రమాదాలు జరగకముందు అధికారులు స్పందించివెంటనే డబుల్ రోడ్డుపనుల్లో భాగంగా కుంగిన లోలెవల్ కల్వర్టును తొలగించి వెంటనే హైలెవల్‌బ్రిడ్జీని నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలకు

ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికెట్

- పాఠశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను చూపెడుతున్న చాడ వెంకటరెడ్డి

తిమ్మాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్ గ్రామంలోగల స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసికదివ్యాంగుల పాఠశాలకు ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికేట్ గుర్తింపు లభించిందని పాఠశాల చైర్మన్, మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు. క్వాలిటీ మెనేజ్‌మెంట్ సిస్టం అనే సర్టిఫికేట్ నిర్వాహకులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సర్టిఫికేట్‌కు మూడు సంవత్సరాల వరకు గుర్తింపు ఉంటుందని తెలిపారు. క్యూఆర్‌ఏ ఢిల్లీ సంస్థవారు దివ్యాంగుల పాఠశాలను సందర్శించి, అన్నిరకాల పరిశోధనలుచేసి ఐఎస్‌వో సర్టిఫికేట్ విడుదల చేసినందుకు పాఠశాల తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సర్టిఫికేట్ ద్వారా దేశ,విదేశాలలో ఈ పాఠశాలకు గుర్తింపు వస్తుందని చాడవెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టుసభ్యులు కోమిరెల్లా రెడ్డి, ఎల్ మధుసుధన్‌రావు, గాజుల భగవాన్ నేత, జాప వెంకటరమణారెడ్డి, నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ సతీష్, ఈవో బాలరాజు, వార్డెన్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సెమినార్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయి

● ఎస్‌యూ వీసీ యు ఉమేష్‌కుమార్



మాట్లాడుతూన్నా ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): సెమినార్లు విద్యార్థులకు ఎంతో దోహదపడుతాయని శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఆచార్య ఉమేష్‌కుమార్ తెలిపారు. గురువారం శాతవాహన విశ్వవిద్యాలయంలో రెండు రోజుల సెమినార్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్-ఎ కీ క్యాటలిస్ట్ ఇన్ సస్టైనబుల్ బిజినెస్ డెవలప్మెంట్ ముగింపు సదస్సులో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఇలాంటి రెండురోజుల సెమినార్ నిర్వహించిన డాక్టర్ డి హరికాంత్, అధ్యాపక బృందాన్ని అభినందించారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ డి హరికాంత్ మాట్లాడుతూ ఈ రెండురోజుల సెమినార్‌లో మొత్తం114 పరిశోధకపత్రాలు పంపించాని అందులో 74పేపర్ ప్రెజెంటర్స్ తమ రీసెర్చ్ పేపర్స్‌ని వివరిస్తూ వివిధ అంశాలపైన తమ పరిశోధనలు వివరిస్తూ సమాజానికి ఉపయోగపడే అంశాల గురించి చర్చించారని తెలిపారు. విశిష్ట అతిథి కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడున్న ప్రస్తుత సమయంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనేది చాలా ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో విశిష్టఅతిథులుగా కే ప్రతాప్ రెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి, ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్ ఐసిఎస్ఎస్ఆర్- ఎస్‌ఆర్‌సి హైదరాబాద్, విశిష్ట అతిథులుగా ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, రిజిస్ట్రార్ శాతవాహన యూనివర్సిటీ, ప్రొఫెసర్ చెన్నప్ప రిజిస్ట్రార్, పాలమూరు విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ ఆకుల రవి, డీన్ కామర్స్ డిపార్ట్మెంట్ శాతవాహన విశ్వవిద్యాలయం, వాణిజ్య శాస్త్ర ఆచార్యులు మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం అతిథులుగా హాజరయ్యారు.

బ్యాంకింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని డిగ్రీ ఉత్తీర్ణులైన వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు మార్చి 15వ తేదీనుంచి ఏప్రిల్8వరకు వెబ్‌సైట్ www.tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈశిక్షణకు బిసి-ఎ, బి,డికి చెందిన, డిగ్రీపూర్తిచేసి 26సంవత్సరాల వయస్సులోపు ఉన్న అభ్యర్థులు అర్హులు అని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతంలో 1.50లక్షలు, పట్టణ ప్రాంతంలో 2లక్షల లోపు ఉండాలని. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ 12-4-2025తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.వచ్చిన మార్కుల ఆధారంగా 30మందిని అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థలో శిక్షణకు..

తిమ్మాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణాసంస్థలో హౌస్ వైరింగ్, ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ ఏప్రిల్ 1నుంచి ప్రారంభం కానున్నట్లు దీనికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకుచెందిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆసక్తిగల పురుషులు దరఖాస్తు చేసుకో వాలని తెలిపారు. 30రోజుల పాటు ఈ ఉచితశిక్షణ ఉంటుందని ఎంపికైనా అభ్యర్థులకు ఉచితవసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు 9849411002, 7981151653 నంబర్లను సంప్రదించాలని కోరారు.


జ్యూట్ బ్యాగు కట్టింగ్‌పై శిక్షణ తీసుకుంటున్న మహిళలు


శిక్షణలో మహిళలు తయారు చేసినవివిధ రకాల జ్యూట్ బ్యాగులు



జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ

- తిమ్మాపూర్ దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రంలో నెల రోజుల కోర్సు
- శిక్షణ పొందుతున్న మహిళలకు భోజన సౌకర్యం

తిమ్మాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్లాస్టిక్..ప్లాస్టిక్.. పర్యావరణాన్ని దెబ్బతిసే ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించినా ఏదో ఓ రూపంలో ముందుకువస్తోంది. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగులు వాడాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా తిమ్మాపూర్ దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు.

● కలెక్టర్ చొరవతో..

కొన్నేళ్లుగా మండలంలోని దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రం(మహిళా కేంద్రం)లో మహిళాలకు ఇచ్చే ఉచిత శిక్షణలు కనమరుగయ్యాయి. ఇటీవల ప్రాంగణాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి పరిస్థితిని గమనించారు. వారి చొరవతో ఉచిత శిక్షణను తిరిగి ప్రారంభించారు. ఫిబ్రవరి 14 నుంచి జ్యూట్ బ్యాగుల తయారీపై ఉచిత శిక్షణను ప్రారంభించారు. నెల రోజుల ఉచిత శిక్షణతోపాటు శిక్షణ పొందుతున్న వారికి మధ్యాహ్నం ఉచిత భోజన సౌకార్యం కల్పిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 25 మంది మహిళలు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. శిక్షణ అనంతరం వారు జ్యూట్ బ్యాగుల తయారు చేసి విక్రయించే విధంగా చిన్న పరిశ్రమ పెట్టుకునేందుకు ప్రభుత్వం నుంచి అర్హులైనా వారికి సహకారం కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శిక్షణ బాగుంది..



– కె కోమల, కట్టరాంపూర్, కరీంనగర్

నేను మహిళా ప్రాంగణంలో జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ తీసుకుంటున్నా. శిక్షణ బాగుంది. ప్రతి రోజు ఓ రకమైన బ్యాగులను తయారు చేయడం నేర్పిస్తున్నారు. మహిళా గ్రూప్‌లో ఉన్న నాలుగురు సభ్యులం కలిసి ఈ శిక్షణ తీసుకుంటున్నం. శిక్షణ అనంతరం నాలుగురం కలిసి సొంతంగా జ్యూట్ బ్యాగుల తయారు పరిశ్రమ పెట్టుకుంటాం.

గ్రామాల్లో జ్యూట్ బ్యాగులను వాడేవిధంగా కృషి చేస్తాం



– రేవతి, పోరండ్ల

గ్రామాల్లో జ్యూట్ బ్యాగులపై అవగాహన ఉండదు. వీటిని తయారు చేసి ప్రజలకు అవగాహన కల్పించి విక్రయిస్తాం. పర్యావరణ పరిరక్షణతోపాటు ఉపాధి లభిస్తుంది. రైతులు, విద్యార్థులు, ఇంట్లో వస్తువులు కొనుగోలు చేసి తీసుకువెళ్లేందుకు ఈ జ్యూట్ బ్యాగులు ఉపయోగపడుతాయి. పర్యావరణ పరిక్షణకు జ్యూట్ బ్యాగులు వాడల్సిన అవసరం ఉంది.

25 మంది శిక్షణ పొందుతున్నారు..



– సవిత, ట్రైనర్

ప్రస్తుతం 25 మంది మహిళలు జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొందుతున్నారు. వారికి ప్రతి రోజు ఒక రకం బ్యాగు తయారు చేయడం నేర్పిస్తున్నాం. తక్కువ మార్జిన్‌తో బిజినెస్ ఎలా ప్రారంభించాలి, మార్కెటింగ్ ఎలా చేయాలి అనే దానిపై శిక్షణ అందిస్తున్నాం. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జ్యూట్ బ్యాగుల అర్డర్లు కూడా ఇప్పిస్తాం.

మహిళలకు ఉపయోగకరం



– వి సుధారాణి, జిల్లా మేనేజర్, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి చొరవతో ప్రాంగణం తిరిగి ప్రారంభమైంది. జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణకు కలెక్టర్ ఆర్థిక సహకారం అందిస్తున్నారు. మహిళలకు శిక్షణతో పాటు మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళాలకు సర్టిఫికేట్‌తో పాటు సొంతంగా వ్యాపారం నిర్వహించుకునేందుకు ఆర్థిక వనరులు, రుణం అందిస్తాం. ఈ శిక్షణ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

యోగా చాంపియన్‌కు సన్మానం

● అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి
● కలెక్టర్ పమేలా సత్పతి


ఆమని పటేల్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్/సుల్తానాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సీనియర్ నేషనల్ యోగా చాంపియన్‌షిప్‌లో ఐదవస్థానం కైవసం చేసుకున్న ఆమనిపటేల్ జాపతిని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి ఘనంగా సన్మానించారు. జాపతి ఆమని గతనెలలో కేరళలోని త్రివేంద్రంలో జరిగిన జాతీయ సీనియర్స్ యోగాసన చాంపియన్‌షిప్‌లో రాణించి ఐదవస్థానం సాధించింది. ఈసందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో తెలంగాణ యోగా అసోసియేషన్, కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ బాధ్యుల సమక్షంలో ఆమనిని ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయికి ఎంపికవ్వాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కరీంనగర్ జిల్లా యోగా క్రీడాకారులు కొన్ని నెలలుగా అద్భుతమైన ప్రదర్శనతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించడం సంతోషదాయకమన్నారు. ప్రతిభావంతులకు ప్రభుత్వం పక్షాన ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడశాఖ అధికారి వి శ్రీనివాస్, తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, యోగా కోచ్‌లు వి కిష్టయ్య, గుంటి రామకృష్ణ, పి మల్లేశ్వరి, జె రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తజన సందడి


వేంకటేశ్వర స్వామి వారి ఊరేగింపు

ధర్మపురి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గురువారం భక్తజన సందడి నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటేశ్వర స్వామివారలను అశ్వవాహనంపై ఊరేగించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రాల మధ్య ప్రత్యేకపూజలు నిర్వహించారు. లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధఆలయాల్లో ఆలయ వేదపండితులు నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలను నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారలకు మహిళలు ఓడిబియ్యం సమర్పించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం పక్షాన 6వేలమంది భక్తులకు అన్నదానం చేశారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఆలయానికి రూ.8,03,092 ఆదాయం లభించింది. ఇందులో వివిధరకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.2,86,216 ప్రసాదాలు విక్రయించగా 4,61,000 లభించాయి. అలాగే అన్నదానం కోసం రూ.55,876 భక్తులు, దాతలు విరాళాలు సమర్పించినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

ఆయాకార్యక్రమాల్లో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మ పుష్కరిణి లో శ్రీ పాత (యోగ) నారసింహ స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం ఉంటుంది. శ్రీ సద్గురు త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

కొండగట్టులో గిరిప్రదక్షిణ

- కొండ చుట్టూ 5.7కి.మీల మేర నడకమార్గం
- అభివృద్ధికి సొంత డబ్బులు అందించిన మంత్రి పొన్నం
- పూర్తయిన పనులు

మల్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో గిరిప్రదక్షిణకు వస్తున్న భక్తుల సంఖ్య ప్రతి నెలా పెరుగుతోంది. 2023 నుంచి ప్రతి పౌర్ణమి రోజు గిరిప్రదక్షిణను నిర్వహిస్తున్నారు. 2023లో చిలుకూరుకు ఆత్మారాం సురేశ్‌శర్మ ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ ప్రారంభించారు. శుక్రవారం పౌర్ణమి సందర్భంగా నిర్వహించే గిరిప్రదక్షిణ 26వది.కొండగట్టు చుట్టూ ప్రస్తుతం 5.7కి.మీ మేర గిరిప్రదిక్షణకు నడక మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు అయిన మూడు లక్షల రూపాయలను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అందించారు. దిగువ కొండగట్టు స్టేజీ వద్ద ఉన్న హ నుమాన్ విగ్రహం నుంచి ఘాట్‌రోడ్డు, వై జంక్షన్ మీదుగా జేఎన్‌టీయూ మార్గంలోని బొజ్జపోతన ఆలయం వరకు మూడు కిలోమీటర్లు, అక్కడి నుంచి గుట్టను ఆనుకొని మంచి నీళ్ల బావి, సంతోళ్లలొద్ది నుంచి మెట్ల మార్గం వరకు మరో 2.7కి.మీలతో నడకమార్గం ఏర్పాటయింది. దీంతో గిరిప్రదక్షిణ సులువు కావడంతో వందలాదిగా భక్తులు పాల్గొంటున్నారు. ఈ మార్గం ఏర్పాటు కాకముందు దిగువ కొండగట్టు, దొంగలమర్రి, జేఎన్‌టీయూ, రాంసాగర్, మద్దుట్ల, నూకపల్లి, మల్యాల క్రాస్‌రోడ్డు, కొండగట్టు వరకు సుమారు 24 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ చేశారు. ప్రస్తుతం అది 5.7 కిలోమీటర్లకు తగ్గడంతో భక్తులకు సౌకర్యంగా మారింది.


కొండగట్టు గుట్ట చుట్టూ ఏర్పాటు చేసిన నడక మార్గం

సమాజహితం కోసమే

– ఆత్మారాం సురేశ్‌శర్మ మహరాజ్, గిరిప్రదక్షిణ ప్రారంభకులు



భక్తులందరినీ ఒక చోట చేరుస్తూ వారికి భగవంతుడి శక్తిని ప్రసాదించడం కోసం ఈ గిరి ప్రదక్షిణ చేపట్టాం. వందలాదిగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటున్నారు. భక్తులు ప్రతి నెలా గిరిప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలి. సమాజ హితం కోసమే ఈ కార్యక్రమాన్ని చేపట్టాం.

● అభివృద్ధితో భక్తులకు సౌకర్యం

ప్రస్తుతం చదును పనులు పూర్తి చేసుకున్న గిరిప్రదక్షిణ నడకమార్గాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయాల్సి ఉంది. మట్టి రహదారి కావడంతో భక్తులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఆయాసం వచ్చినప్పుడు, సేదతీరడానికి బెంచీలు, నీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. గిరిప్రదక్షిణ మార్గాన్ని అభివృద్ధి చేస్తామని స్థానిక శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం తెలిపారు.

మార్కులు తక్కువ వస్తాయనే ఆందోళనతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య


మృతిచెందిన పూసాల రోహిత్

చొప్పదండి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో మార్కులు తక్కువ వస్తాయనే ఆందోళనతో ఓ ఇంటర్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని రుక్మాపూర్‌లో గురువారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ అనూష కథనం ప్రకారం.. రుక్మాపూర్‌కు చెందిన పూసాల రోహిత్(17) కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి వరకు చదువుకున్న రోహిత్ గురువారం వేకువజామున ఇంటిముందు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పరీక్షల్లో మార్కులు తక్కువ వస్తాయనే ఆందోళన చెంది ఉరివేసుకొని మరణించాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో సత్తా చాటిన అగ్రహారం విద్యార్థులు



పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

వేములవాడ టౌన్ మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో సత్తాను చాటారు. ప్రభుత్వడిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం విద్యార్థులు కాంపాక్ట్ డిస్క్ యాజ్ ఏ డిఫ్రాక్షన్ గ్రేటింగ్ అనే అంశంపై పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధనలో, కంపాక్ట్ డిస్క్‌ద్వారా కాంతి వివర్తనాన్ని ఎలా ప్రదర్శించవచ్చో, డిస్క్‌లోని వలయాల మధ్యదూరాన్ని లేజర్‌కాంతి సహాయంతో ఎలా నిర్ణయించవచ్చో విశ్లేషించారు. ఈ ప్రయోగం భౌతికశాస్త్రంలో కాంతి వివర్తన లక్షణాలను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని, కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ నిర్వహించిన జిజ్ఞాస కార్యక్రమం రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఈ ప్రాజెక్టు ఎంపికైందని, భౌతికశాస్త్ర విభాగ విద్యార్థులు, ప్రాజెక్టు సూపర్‌వైజర్ డాక్టర్ ఎస్. కృష్ణప్రసాద్ నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శంకర్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ టి లావణ్య పరిశోధనలో పాల్గొన్న విద్యార్థులను ప్రాజెక్టు సూపర్‌వైజర్‌ను అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

గన్నేరువరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గన్నేరువరం శివారులో గురువారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా చొక్కారావుపల్లి నుంచి ఆటోలో సుమారు 4 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మండల కేంద్రానికి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. గన్నేరువరానికి చెందిన గంటా కొమురయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జ్యూరీ సభ్యుడిగా డాక్టర్ రవిచంద్ర


డాక్టర్ రవిచంద్ర

కరీంనగర్ కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నేపాల్ అంతర్జాతీయ 8వ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా డాక్టర్ పొన్నం రవిచంద్ర ఎంపికయ్యారు. నేపాల్‌లో ఈనెల 19నుంచి 25వ తేదీవరకు జరగనున్న ఐఎఫ్ఎఫ్ఎస్ డాన్ క్విక్సోట్ అంతర్జాతీయ 8వ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌత్‌రీజియన్ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పొన్నం రవిచంద్రను నియమించినట్లు ఫెస్టివెల్ చైర్‌పర్సన్ కెపిపాఠక్ తెలిపారు. జ్యూరీ సభ్యులు ఐఎఫ్ఎఫ్ఎస్ డాన్ క్విక్సోట్ ఫీచర్‌ఫిల్మ్ అవార్డు కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉత్తమచిత్రాలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

కూతురితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు శిక్ష

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కూతురితో అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాలరూరల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన వ్యక్తి తనకూతురితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితకుటుంబ సభ్యులు 2021లో జగిత్యాలరూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై చిరంజీవి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటి అధికారులు ఎస్సైలు చిరంజీవి, శ్రీకాంత్, కానిస్టేబుళ్లు నరేష్, శ్రీధర్, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

రాజన్న ఆలయంలో ఘనంగా డోలోత్సవం

వేములవాడ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం డోలోత్సవం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. రాజన్న ఆలయంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన డోలోత్సవం కార్యక్రమంలో అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికిభక్తులుహాజరైమొక్కులు చెల్లించుకున్నారు.


డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఇద్దరికి రిమాండ్

జగిత్యాలక్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశానికి పంపిస్తానని రూ.3.5 లక్షలు తీసుకుని మోసగించిన కేసులో ఇద్దరు వ్యక్తులను జగిత్యాల పట్టణ పోలీసులు పట్టుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన దేశెట్టి రాకేష్ అనే వ్యక్తిని ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి పంపి స్తామని చెప్పి జగిత్యాల పట్టణానికి చెందిన అల్లెపు వెంకటేష్, చల్ల మహేష్ అనే ఇద్దరు వ్యక్తులు మోసానికి పాల్ప డ్డారు. దీంతో పోలీసులు బుధవారం అల్లెపు వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు. 24 గంటల వ్యవధిలోనే మరో నిందితుడైన చల్ల మహేష్ గురువారం పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణు గోపాల్ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి


రవి (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగ డపల్లి గ్రామంలో విద్యుత్‌షాక్‌తో రైతు మృతి చెందాడు. నక్కల రవి(30)అనే రైతు గురువారం ఉదయం పొలానికి నీరు పెట్టడానికి వెళ్లాడు. విద్యుత్ మోటార్ ఆన్ కాకపోవడంతో స్టార్టర్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి రవి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన గొర్రెల కాపరులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కు టుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కథల పుస్తకం ఆవిష్కరించిన కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్/కాల్వశ్రీరాంపూర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పుల్లూరు జగదీశ్వర్‌రావు బాలల కథల పుస్తకం రాశారు. ఈ పుస్తకాన్ని కలెక్టర్ కోయ శ్రీహర్ష కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. 24కథల బాలల పుస్తకం తెలుగు, ఆంగ్లంలో రాశారు. చక్కగా రాసిన తహసీల్దార్‌ను కలెక్టర్ అభినందించారు. శ్రీనివాస్, గర్రెపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ భూములకు తొలగిన రిజిస్ట్రేషన్ తిప్పలు

సుల్తానాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీనగర్ వాసులు ఎదుర్కొంటున్న భూముల రిజిస్ట్రేషన్ సమస్యను ప్రభుత్వం తొలగించిందని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరవై సంవత్సరాలుగా గాంధీనగర్‌కు చెందిన సర్వేనంబర్లు 909/1, 303/2లో ఉన్న భూముల క్రయవిక్రయాలు జరుగకుండా ఉండిపోయాయన్నారు. ప్రభుత్వ భూములుగా ఆన్‌లైన్ తప్పిదంతో నమోదు కావడంతో రిజిస్ట్రేషన్లు చేయించుకోలేని దుస్థితి ఉండేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు చొరవతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆన్‌లైన్‌లో తప్పిదాన్ని సవరించారని తెలిపారు మంత్రులకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా కామదహనం.. హోలీ సంబరాలు


సుల్తానాబాద్, గోదావరిఖనిలో కామదహనం, హోలీ ఆడుతున్న ట్రినిటీ బీఈడీ విద్యార్థులు

కోల్‌సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పలు పాఠశాలల్లో గురువారం ముందస్తు హోలీ సంబరాలు నిర్వహించారు. రమేష్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయంలో విద్యార్థులు హోలీ సంబరాలను నిర్వహించారు. కరస్పాండెంట్ విక్రమ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో హోలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవి విద్యా ర్థులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. డీన్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కండేయకాలనీ, (ఆంధ్రజ్యోతి): ఖని ప్రధాన చౌరస్తాలో గురువారం రాత్రి కాముని దహన కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. కాల్వ లింగస్వామి, దీటి బాలరాజు హాజరై మాట్లాడుతూ హోలీని ప్రజలు ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. తిప్పారపు శ్రీనివాస్, బొమ్మక రాజేష్, నాయిని ఓదెలు, గట్ల రమేష్, చుక్కల శ్రీనివాస్, పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): పాత జెండా చౌరస్తా వద్ద కామదహనం నిర్వహించారు. మంటల్లో కుడుకలు పెరుగన్నం, నెయ్యి ఇతర నైవేద్యాలను సమర్పించి మంట చుట్టూ తీర్థం చల్లారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత క్రిష్ణ, గడ్డం శ్రీనివాస్, నగునూరి స్వామి, శ్రీలత నాగరాజు, కొమురవెల్లి అంజన్న, సాగర్, జయమ్మ, రాజ్యలక్ష్మి, పాల్గొన్నారు.

పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలల్లో హోలీ సంబరాలు జరుపుకున్నారు. కళాశాలల్లో కలర్స్ డే నిర్వహించి బ్లూ, గ్రీన్ దుస్తులు ధరించి సంబరాలలో పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రేకులపల్లి విజయకుమార్, ప్రిన్సిపాల్స్ బండారి కమలాకర్, బాలసాని శ్రీనివాస్ అధ్యాపకులు పాల్గొన్నారు.

కాముని పౌర్ణమిని పురస్కరించుకుని కనుకలలో గ్రామస్తులు హోలీ పండుగ సంబరాలు జరుపుకున్నారు. పౌర్ణమి రాత్రి హోలీ పండుగను జరుపుకుంటామని వారు తెలిపారు. చిన్నారులతో సహా అందరూ కలర్స్ చల్లుకుని హోలీ వేడుకలు జరుపుకున్నారు.

పెద్దపల్లి కల్చరల్, (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ట్రినిటీ కళాశాలలో ముందస్తు హోలీ సంబరాలు నిర్వహించారు. ఒకరికొకరు రంగులు పూసుకొని ముందస్తు హోలీ సంబ రాలు నిర్వహించారు. శుక్రవారం సెలవుదినం కావడంతో ముందస్తుగానే కళాశాల ప్రాంగణంలో సంబరాలు నిర్వహించి విద్యార్థులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రిన్సిపాల్ బుర్ర తిరుపతి, అధ్యాపకులు దిలీప్‌శర్మ, మధూకర్, పి.తిరుపతి, రమేష్, అనురాధ, సుజాత, జ్యోతి, సునీత, అపర్ణ, స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాఠశాలల్లో ఏఐ బోధన

పెద్దపల్లి కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపిక చేసిన ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)ఏఐను వినియోగిస్తూ సులభతరంగా బోధన చేసేందుకు చర్యలు చేపట్టాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణ అన్నారు. గురువారం హైదరాబాద్ నుంచి విద్యాశాఖ సంచాలకులు నరసింహారెడ్డితో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత నెలలో ఏఐ వినియోగిస్తూ విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన చేసేందుకు పైలెట్ ప్రాజెక్టుకింద 6జిల్లాలో ప్రారంభించామని, రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. 3నుంచి 5వ తరగతి విద్యార్థులను ఎంపిక చేశామన్నారు. జిల్లాలో ముందస్తుగా ఎంపికచేసిన పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులకు ఏఐ వినియోగిస్తూ సులభతరంగా బోధన చేయాలన్నారు. ఏఐ కోర్సుద్వారా విద్యార్థులకు బోధన చేసేందుకు వీలుగా ప్రతి పాఠశాలలో ఐదు కంప్యూటర్లు, ఇంటర్నెట్ కనెక్షన్, హెడ్‌ఫోన్స్ అందుబాటులో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సమగ్రశిక్ష సమన్వకర్త పీఎంషేక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంపుపై శ్రద్ధచూపాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల విద్యాప్రమాణాలు పెంచడంపై కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో మంథని మండలం ప్రాథమిక, ప్రాథమికోన్నత హెడ్మాస్టర్లతో ఎఫ్ఎల్ఎస్‌పై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల సమర్థ నిర్వహణ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పటిష్ట పర్యవేక్షణతోనే సాధ్యమవుతుందన్నారు. పాఠశాలల్లో గుణాత్మక విద్య మెరుగుపరచడానికి సూచనలు కలెక్టర్ అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్‌లలో రాసి చదివే సామర్థ్యాలను పెంచాలని, గణితంలో కనీస సామర్థ్యం ఉండేలా దృష్టి సారించాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష సమన్వయకర్త పిఎంషేక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలం బాట

సుల్తానాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుకుల సెక్షన్ పరిధిలోని సుద్దాలలో విద్యుత్ అధికారులు గురువారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈ దామోదర్ రావు మాట్లాడుతు రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా అధికారులు పని చేస్తున్నారన్నారు. రైతులు ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మర్లకు ఎర్త్ సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిపై అవగాహన కల్పించేందుకు పొలంబాట చేపట్టామన్నారు. లైన్‌ఇన్స్‌పెక్టర్ రాజేశం, రమేష్, ఐలయ్య, కుమార్,పృథ్వీరాజ్, నరేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సీపీని కలిసిన గుర్తింపు సంఘం నేతలు

జ్యోతినగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రామగుండం సీపీగా బాధ్యతలు తీసుకున్న అంబర్ కిశోర్ ఝాను గురువారం ఎన్టీపీసీ గుర్తింపు సంఘం నాయకులు కలిసారు. పీటీఎస్‌లోని వీజీపీ గెస్టహౌజ్‌లో ఎన్టీపీసీ ఎన్‌బీసీ సభ్యుడు, గుర్తింపు సంఘం(ఐఎన్‌టియుసి) సెక్రెటరీ జనరల్ బాబర్ సలీంపాషా, అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, రాజేశ్వర్, సీపీని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీపీ అంబర్ కిశోర్ ఝా తండ్రి కూడా గతంలో ఎన్టీపీసీ సంస్థలో పని చేశారు. ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్‌ఆర్) విజయ్ కుమార్ సిక్దర్, హెచ్‌ఆర్ అధికారులు ప్రవీణ్ కుమార్ చౌదరి, దీపక్ పాఠక్, ఎ.కె.పాడే, యుగంధర్‌రావు, ఐఎన్‌టియుసి నాయకులు బూమల్ల చందర్, గోపాల్‌రావు, రాసపల్లి సంపత్, మల్లేశం, రాజేశం పాల్గొన్నారు.

సీసీ రోడ్డు విషయంలో వివాదం

కమాన్‌పూర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జూలపల్లి గ్రామం ఆదర్శనగర్‌లోని సీసీ రోడ్డు నిర్మాణంలో మహిళ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాలా రాజు మధ్య కొద్ది రోజులక్రితం వివాదం జరిగింది. ఈవివాదం చిలికి చిలికి గురువారం ఒకరిపై ఒకరు ఫిర్యాదుతో ఠాణాకు చేరింది. ఈనెల 11న సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని మహిళ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిని అడగగా ఆమెపై దుర్భాషలాడడంతో మహిళ పెద్ద మనుషులను కలిసి విన్నవించింది. ఈ విషయమై మహిళ, గ్రామ పెద్దలు రాజును అడిగేందుకు వెళ్తున్న క్రమంలో అతను ఎదురుపడ్డాడు. ఈక్రమంలో ఇరువురి మధ్య జరిగిన వాగ్వివాదంలో సదరు మహిళ కాంగ్రెస్ నేతపై చెయ్యి చేసుకుంది. దీంతో ఆ నేత పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. సదరు మహిళ సైతం కాంగ్రెస్ నేత నన్ను దూషించాడని ఫిర్యాదు చేసింది. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మండల సమైఖ్య అధ్యక్షురాలిగా స్వప్న

ఓదెల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గురువారం మల్లికార్జున మండల సమైఖ్య పాలకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. మండల సమైఖ్య అధ్యక్షురాలిగా భాయమ్మపల్లికి చెందిన అలేటి స్వప్న ఎన్నికైంది. అలాగే కార్యదర్శిగా పోషవేణి అనూష, కోశాధికారిగా జంగ అనూష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీఎం లతా మంగేశ్వరి, సీసీలు శ్రీనివాస్, మల్లయ్య, కొమురయ్య , విజయ , రాజకుమారి, అకౌంటెంట్ భవాని, ఆపరేటర్ పవన్‌కుమార్‌లతో పాటు అన్ని గ్రామ సంఘ అధ్యక్షులు , కార్యదర్శులు పాల్గొన్నారు.

రామగుండంలో 'బూడిద' రాజకీయం

(5వ పేజీ తరువాయి)

టున్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారు. ఇందులో ఎమ్మెల్యే హస్తం ఉందని బాహాటంగా ఆరోపిస్తున్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు, విమర్శలను కాం గ్రెస్ పార్టీ నాయకులు తిప్పికొడుతున్నారు. యాష్ పాండ్‌లోకి వాహనాలు వెళ్లాలంటే మట్టి తీసుకవచ్చి తాత్కాలికంగా రోడ్లు వేయడంతోపాటు నిత్యం వాట రింగ్ చేయాల్సి ఉంటుందని, దానికయ్యే ఖర్చు కలుపు కునే లోడింగ్ చార్జీలు వసూలు చేస్తున్నారని, అక్రమ వసూళ్లు, అదనపు వసూళ్లు ఏమి లేవని కాంగ్రెస్ పార్టీ నాయకులతోపాటు ఇటుక బట్టీల యజమానులు ఖండిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బూడిద లోడింగ్ చేసేందుకు ఆ పార్టీ నాయకులు బినామీల పేరిట పొక్లెయిన్లు పెట్టి ఒక్కో లారీకి 18 వేల రూపా యల వరకు వసూలు చేశారంటూ కాంగ్రెస్ నాయ కులు ప్రత్యారోపణలు చేస్తున్నారు.

బూడిద లోడింగ్ అంశం ఇరుపార్టీల మధ్య రాజకీయ దుమారం రేపుతున్నది. బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి మల్యాలపల్లి యాష్ పాండ్ వద్దకు వెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ముర్మూర్ వద్ద నిల్వ చేసిన మట్టిని అనుమతులకు మించి తీసుక వచ్చారని, ఆ మట్టిని కూడా ఇటుక బట్టిల వ్యాపారులు తరలిస్తున్నారని, ఈ వ్యవహారంలోనూ కాంగ్రెస్ నాయకులు ముడుపులు ముట్టాయని కౌశిక హరి ఆరోపణలు చేశారు. దానిని ఇటుక బట్టీల యజమానులు ఖండించారు. నిబంధనల ప్రకారమే తాము ప్రభుత్వానికి సీనరేజీ ట్యాక్స్ చెల్లించామని పేర్కొన్నారు. పరిమితికి మించి మట్టిని తోడి నట్లు తేలితే, అందుకు తగిన జరిమానా చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని వారు ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రామగుండం నియోజకవర్గంలో ఆర్ఎఫ్‌సీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుల వద్ద డబ్బుల వసూళ్లు, కుందనపల్లి యాష్ పాండ్‌లో బూడిద తరలింపులో బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్దఎత్తున దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అప్పటి ఎమ్మెల్యేపై ఆరోపణలు, విమర్శలు గుప్పించి రాజకీయంగా తమకు అనుకూలంగా మలు చుకున్నారు. బూడిద వ్యవహారంలో లోడింగ్ చార్జీలపై ఇప్పటి వరకు ఎన్టీపీసీ అధికారులు ఏమీ మాట్లాడక పోగా, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య విమర్శనాస్త్రాలు నడుస్తున్నాయి. ఇది ఎటువైపు దారి తీస్తుందో వేచిచూడాలి.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా

పెద్దపల్లిటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందజేస్తామని ఎన్పీడీసీఎల్ ఇన్‌చార్జి డైరెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. పెద్దపల్లిలో గురువారం పర్యటించారు. పెగడపల్లి సబ్ స్టేషన్ 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. 11 కేవి పెగడపల్లి గ్రామానికి, వ్యవసాయానికి ఒకే బ్రేకర్ ఉండేదని, పెగడపల్లి గ్రామానికి కొత్త బ్రేకర్ ఏర్పాటును పరిశీలించారు. వేసవి కాలం కరెంట్ నిరంతరంగా అందించడానికి ముందస్తు ప్రణాళిక అమలు చేస్తున్నామని, 33 కేవీ లింక్ లైన్లు ఒక సబ్ స్టేషన్ నుండి పక్క నున్న సబ్ స్టేషన్ కు 15 కేవీ లైన్ వేస్తున్నామని, పనులు నెలాఖరుకు పూర్తవుతాయన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

కోల్‌సిటీటౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని రామగుండం ఎంఈవో గడ్డం చంద్రయ్య అన్నారు. ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్‌లో భాగంగా గోదావరిఖనిలోని విఠల్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జెడ్‌పీహెచ్ఎస్ బాలికల పాఠశాలను గురువారం సందర్శించారు. కంప్యూటర్ ల్యాబ్, సైన్స్‌ల్యాబ్, డిజిటల్ విద్యాబోధన, లైబ్రేరీ స్పోర్ట్స్ మెటిరియల్‌పై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు జింక మల్లేశం, సమ్మయ్య, పీడీ లక్ష్మణ్, పాల్గొన్నారు.

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో వసతి సౌకర్యాలు మెరుగయ్యాయని మండల విద్యాధికారి రాజయ్య అన్నారు. గర్రెపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పలు వసతులను చూపించారు. నారాయణరావుపల్లి, గొల్లపల్లి, ఐతరాజుపల్లి, కాట్నపల్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. హెచ్ఎంలు కవిత, లక్ష్మయ్య, అంజయ్య,చంద్రమౌళి, తిరుపతిరెడ్డి,మహిపాల్ రెడ్డి, రాజయ్య సీఆర్‌పీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ట్విన్నింగ్ కార్యక్రమం జరిగింది. పెద్దంపేట, కిష్టంపేట, ఇదిలాపూర్, కాల్వశ్రీరాంపూర్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు కాల్వశ్రీరాంపూర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఐఎఫ్‌పి ప్యానెల్‌బోర్డు ద్వారా పాఠశాలలో ఎలా నేర్చుకోవాలో విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎంఈఓ మహేష్, హెచ్ఎం సునీత, పాల్గొన్నారు.

ఎలిగేడు: సుల్తాన్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్(ఒకపాఠశాలను మరొక పాఠశాలకు అనుసంధానం చేయడం) కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు విజ్ఞాన శాస్త్ర ప్రయోగాలు, పాఠశాల గ్రంథాలయం, ఐఎఫ్‌పి ప్యానల్ ద్వారా మాథ్స్, సైన్స్, క్విజ్, లైబ్రరీ రూమ్ నిర్వహణ, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, నిర్వహించిన కార్యక్రమాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మండల విద్యాధికారి అనసూరి నరేంద్రచారి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం గంగ్ర దేవేందర్‌రావు, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ధూళికట్ట హైస్కూల్ హెచ్ఎం బిజిలి సదయ్య, సంతోష్‌రెడ్డి, అనిత, శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, గీత, భాస్కర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఓదెల: పొత్కపల్లిలో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నారని ఎంఈఓ రమేష్ అన్నారు. ట్విన్నింగ్‌లో భాగంగా పొత్కపల్లి, కొలనూర్ హైస్కూళ్లను సందర్శించారు. యుపీఎస్, ఎంపిపిఎస్‌పాఠ శాలల తో పాటు వశిష్ఠకేరళ పాఠ శాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంబయ్య,ఏసుదాసు,మహేందర్,లక్ష్మణ స్వామి,రజిత తో పాటు ఇతర పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఈవో సరస్వతి ఆధ్వర్యంలో ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వడుకాపూర్, తెలుకుంట ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో చర్లపల్లి, నాగులపల్లి, కాచాపూర్, వెంకట్రావుపల్లి గ్రామాల పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పాలకుర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం కన్నాల, జీడినగర్, బసంత్‌నగర్, జయ్యారం, గుడిపెల్లి, పుట్నూర్ గ్రామాల్లో జరుగుతున్న పనులను జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య పరిశీలించారు. తాగునీటి సరఫరాపై వచ్చిన సమస్యలను, పైపులైన్ లీకేజీలను అరికట్టాలన్నారు. రోజు గ్రామంలో ఉదయం ట్రాక్టర్‌తో ఇంటి ఇంటికి తిరిగి తడి, పొడి చెత్తను తీసుకొని డంప్‌యార్డ్‌కు తరలించి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని సూచించారు. మిషన్‌భగీరథ ఈఈ శ్రీనివాస్, డీఈ సునీల్, ఎంపిడీఓ కలికోట రామ్మోహన్ చారి, ఎంపీవో ఉప్పు సుదర్శన్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంథనిరూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంజపడుగు, నాగారం, మల్లెపల్లి, ఎక్లాస్‌పూర్, సూరయ్యపల్లి గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య గురువారం పరిశీలించారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం సక్రమంగా జరగాలని, గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్‌షెడ్లలో వేరు చేసి నాణ్యమైన కంపోస్టు తయారు చేయాలని కార్యదర్శులకు సూచించారు. ఎల్‌ఆర్ఎస్ రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట డీఎల్‌పీవో కే. సతీష్‌కుమార్, కార్యదర్శులు ఉన్నారు.

ఎలిగేడు(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌పీవో అన్నారు. సుల్తాన్‌పూర్, ఎలిగేడు, ముప్పిరితోట, లోకపేట గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ సెగ్రిగేషన్ షెడ్లలో సేంద్రియ ఎరువులను తయారు చేయాలన్నారు. తయారైన ఎరువును రైతులకు విక్రయించి వచ్చిన డబ్బులను గ్రామపంచాయతీ ఖాతాలో జమ చేయాలని సూచించారు. సుల్తాన్‌పూర్‌లో కూరగాయల మార్కెట్, పంచాయతీ షెట్టర్స్ వేలం నిర్వహించగా అందులో పాల్గొన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, అందుకు కార్యదర్శులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎల్‌ఆర్ఎస్ దరఖాస్తులను ఈనెల 31లోపు తగిన రుసుము చెల్లిస్తే 25శాతం సబ్సిడీ ఉందని పేర్కొన్నారు. ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఎంపీవో ఎండి.ఆరిఫ్, కార్యదర్శులు శివకుమార్, అంజలి, శిరీష, మాసోద్దీన్, పున్నమయ్య, మహేష్ పాల్గొన్నారు.

ఆర్జీ-2 జీఎం నిర్ణయం హర్షణీయం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): క్వార్టర్ల కేటాయింపు విషయంలో ఆర్జీ-2 యాజమాన్యం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని సీఐటీయూ ఆర్జీ-2 బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌లో క్వార్టర్ అలాట్ అయిన కార్మికులు వాటిని తీసుకోవడం లేదని, లిస్టులో తర్వాత ఉన్న కార్మికులకు క్వార్టర్స్ రాక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈవిషయమై ఆర్జీ-2 జీఎం దృష్టికి తీసుకెళ్లగా కౌన్సెలింగ్‌లో పాల్గొని క్వార్టర్ తీసుకోని వారికి సీనియార్టీ ప్రకారం రీకౌన్సెలింగ్ ద్వారా క్వార్టర్లను కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నట్టు ప్రవీణ్ పేర్కొన్నారు. క్వార్టర్ తీసుకున్న కార్మికుడు మూడు రోజుల్లో క్వార్టర్ సెక్షన్‌లో సంప్రదించకుంటే రీకౌన్సెలింగ్ ద్వారా లిస్టులో ఉన్న వారికి కేటాయించడంపై జీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన

కోల్‌సిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ ఆర్ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కార్మికులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్లాంట్ గేట్ ముందు యూనియన్ నాయకుడు అంబటి నరేష్, ఇతర నాయకులు కార్మికులకు నల్ల బ్యాడ్జీలు పెట్టారు. కార్మికులకు వేతనాలు, అలవెన్సులు, ఇన్సెంటివ్‌లు, లాభాల బోనస్ చెల్లించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంగళ శ్రీనివాస్, మంద మల్లేష్, క్రాంతి, అనీల్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

కమాన్‌పూర్, మార్చి 13,(ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ మండలంలోని ఎంపీపీఎస్ రొంపికుంట పాఠశాలలో వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి ఇల్లందుల విజయకుమార్, జడ్పీహెచ్ ప్రధానోపాధ్యాయురాలు నిర్మల జ్యోతి, ఏఏపీసీ చైర్మన్ గొట్టె లత హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేగోళం సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల నృత్యాలు అలరించాయి. ఉపాధ్యాయులు నవత, సంతోష్‌కుమార్, వనితలు పాల్గొన్నారు.

రామగుండం అభివృద్ధిని ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రామగుండంలో జరుగుతున్న అభివృద్ధి చూడలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతిపక్ష హోదాలో బీఆర్ఎస్ నాయకులు సలహాలు ఇవ్వాల్సింది పోయి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సోమారపు సత్యనారాయణ రామగుండాన్ని లండన్‌సిటీ చేస్తానని ప్రగల్భాలు పలికాడే తప్ప ఊరుకు చేసింది ఏమి లేదని, కోరుకంటి చందర్ ఇక్కడి సీఎస్‌ఆర్ నిధులను కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు తరలించుకుపోయినా ఏ రోజు కూడా మాట్లాడలేదన్నారు. రామగుండానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయిస్తున్నారన్నారు. చందర్, కౌశిక హరిలు ఎమ్మెల్యేపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోలేని చందర్ ఐదేళ్ల కాలంలో ఉద్యోగాలు, బూడిద పేరిట దోపిడి చేసింది వాస్తవం కాదా అని వారు ప్రశ్నించారు. కౌశిక హరి యువకులను రెచ్చగొడుతూ రామగుండంలో అశాంతిని సృష్టిస్తున్నాడని, ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల దందా జరిగినప్పుడు కౌశిక హరి ఎందుకు నోరు మెదపలేదని, బూడిద, మట్టి తరలించుకుపోయే వారి వద్ద డబ్బులు వసూలు చేసింది వాస్తవం కాదా అని వారు ప్రశ్నించారు. నాయకులు కాల్వ లింగస్వామి, ప్రకాష్, దీటి బాలరాజు, ముస్తాఫా, సింహాచలం, నాయిని ఓదెలు, శంకర్, శంకర్, సాంబమూర్తి, పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులకు న్యాయం జరిగేలా కృషి

రామగిరి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ కార్మికులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని వైస్ ఛాన్సలర్ డాక్టర్ కిషన్‌కుమార్‌రెడ్డి తొలగించిన అవుట్ సోర్సింగ్ సిబ్బంది హామీనిచ్చారు. గురువారం బాధ్యతలు స్వీకరించి జేఎన్టీయూ కళాశాలకు వచ్చిన విసి కిషన్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. 2014లో సుమారు 140 మంది ఉద్యోగులను తొలగించారని పేర్కొన్నారు. తొలగించిన కార్మికులకు న్యాయం జరిగేలా తన వంతుగా కృషి చేస్తానని హామీ నిచ్చినట్లు వారు పేర్కొన్నారు. ా టి సతీష్, మోత్కూరి వెంకటేష్, మంథని సంపత్, సిద్దం రాంనారాయణ, మోత్కూరి అవినాష్‌గౌడ్, మర్కొండ సంతోష్, బుద్దార్థి శ్రీనివాస్, కొండపర్తి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఛావా చిత్ర ప్రదర్శన

మార్కండేయకాలనీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో గురువారం ఊర్వశీ థియేటర్‌లో ఉచితంగా ఛావా చిత్ర ప్రదర్శనను నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు గోదావరిఖని చౌరస్తా నుండి థియేటర్ వరకు ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం థియేటర్‌లో ఛావా చిత్రాన్ని బీజేపీ కార్యకర్తలతో కలిసి వీక్షించారు. పిడుగు కృష్ణ, తోట కుమారస్వామి, రమేష్, తడగొండ నర్సయ్య, అంజి, భాస్కర్, అందే రాజ్ కుమార్‌చారి, బండారి శ్యామ్ కుమార్, పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎంపీ పరామర్శ

మంథని, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక 7వ వార్డులో ఇటీవల మాజీ ఉప సర్పంచ్ ఇనుముల సతీష్ తండ్రి శంకరయ్య అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పెద్దపల్లి మాజీ ఎంపీ చెలిమెల సుగుణ కుమారి గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్‌లు ఉన్నారు.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఘనంగా కవిత జన్మదినం


రక్తదానం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత జన్మ దిన వేడుకలను ఐబీ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. మాజీ ఎంపీపీ బాలాజీరావు, సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్, రాజమల్లయ్య, కమలాదయా కర్, వెంకటేశ్ కేక్ కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేశారు

మంథని: కవిత జన్మదిన వేడుకలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు నివాసంలో నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏగోళపు శంకర్‌గౌడ్, జక్కు రాకేష్, ఎక్కేటి అనంతరెడ్డి, మంథని లక్ష్మణ్, పాల్గొన్నారు.

గోదావరిఖని, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత జన్మదినాన్ని గురువారం టీబీజీకేఎస్ కార్యాలయంలో నిర్వహించారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి హాజరై కేక్‌కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. సింగరేణి సంస్థలో అనేక సమస్యలపై కవిత ఎనలేని పోరాటం చేశారని, మహిళలకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. కౌశిక హరి, మాదాసు రామమూర్తి, నూనె కొమురయ్య, వడ్డేపల్లి శంకర్, చెల్పూరి సతీష్, వెంకట్, పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ-2 ఏరియాలో టీబీజీకేఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. నాయకులు కేక్ కట్ చేశారు. ఐలి శ్రీనివాస్, నాయకులు అబ్బు శ్రీనివాస్‌రెడ్డి, మామిడి తిరుపతి, అనిల్‌రెడ్డి, నరేందర్, రమేష్, రవి, సాగి వెంకటేశ్వర్లు, రమేష్ బాబు, పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



పెద్దపల్లి రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : తుర్కలమద్దికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లిలో గురువారం యాదవ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటింటా బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుల్ల మధ్య ఇంటికో బోనంతో బయలుదేరి మొక్కులు సమర్పించారు. ఆలయం పట్నాలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడి స్థలం ఇచ్చిన దాత సందనవేని తిరుపతి యాదవ్, గుడి నిర్మాణ దాత గోగు రాజయ్య యాదవ్‌ను ఆలయకమిటీ సన్మానించింది. ఆలయ కమిటీ చైర్మన్ బోయిని పోచాలు , కొండ రాజయ్య యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలి


మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఏసీపీ మడక రమేష్ అన్నారు. స్పందన మోడల్ స్కూల్ 40వ వార్షికోత్సవం గురువారం సింగరేణి కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. 1985 నుండి 2024 వరకు పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఏసీపీ మాట్లాడుతూ కేవలం మార్కులు, ర్యాంకులు మాత్రమే ప్రామాణికం కాదన్నారు. విద్యార్థి దశలోనే చెడు అలవాట్లకు లోనవడం, సోషల్ మీడియా వంటి ప్రభావంతో చెడు దారి పట్టడం బాధాకరమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ వ్యవస్థాపకుడు రాజమౌళి, రిటైర్డ్ ఎంఈఓ సంపత్‌రావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, రాజయ్య, కరస్పాండెంట్ ఓదేలు, ప్రిన్సిపాల్ రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్ , మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్.స్వామి అన్నారు. గురువారం అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో సైబర్ క్రైం, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్‌కు పరిమితం కాకుండా చదువుపై దృష్టిసారించాలన్నారు. డ్రగ్స్, గంజాయి, మద్యం జోలికి పోవద్దన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, ఉపాధ్యాయులు అశోక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.